# పండగ మామూళ్లు

వెంపటి నాగభూషణం, యం. ఏ.,

పండగనీ-పర్వమనీ, సంబరమనీ-సంతోషమనీలోకమంతావుంది తత్సందర్భాలలో బంధువులు నలుగురూ కూడుకోవడం, కులాసాగా కాలం గడపడం రివాజు. కాని అట్టిసమయాలలో ప్రత్యేక గౌరవం వుండేది ఒక్క-అల్లుళ్లకే అన్నీ దర్జాగా జరిగిపోతాయి- మరీ ముసిలిఅల్లుళ్లు అయితేతప్ప క్షమించాలి, 'ముసిలి' అనేపదం యథాలోపాన వాడాను 'పాత' అని ఉపయోగించాలిసింది ఎందుచేత నంటే ముసిలివాళ్లుగూడా (రెండో పెళ్లి, మూడో పెళ్లి మొదలైనవి చేసుకున్నవాళ్ల సంగతి మనవిజేస్తున్నాను!) ఒకప్పుడు క్రొత్తఅల్లుళ్లుగా మారకం పొందుతారు అట్టిపరిస్థితులు సంభవించినప్పుడు- ముసిలి- పడుచు తారతమ్యాలు సమసిపోతాయి అల్లుడు!-ఆమాటలోనే వుంది, మంత్రం-మహిమ ఎండిపోయి వంగివున్న తాడిచెట్టును 'అల్లుడా' అని సంబోధిస్తే, తక్షణమే లేచి నిర్భాగ్గా నిలబడ్డదట అల్లుడు-అంటేసరి, బుద్ధులు, చేష్టలు ఎల్లా వున్నా సరే, అత్తవారింట్లోనేగాక, చుట్టుప్రక్కల యిళ్లల్లోనూ, అదృష్టముంటే ఊరంతాను, గౌరవం కట్టె కట్టుకొచ్చి కాళ్లమీద పడ్తుంది.

నాకూ అంతే అనుకున్నాను. మమ్మాటికి అనుకున్నాను మీమీద ఒట్టు! దీపావళికి రావలిసింది అని మామగారిదగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. పెళ్లి జరిగి రెండేళ్లయినా పండగకు రావలిసిందని ఆహ్వానంరావడం యిది మొదటిమారే అందుచేత అత్యావేశంతో ఆహ్వానాన్ని అందుకొని, ఫలానా తేదీకి, ఫలానా రైల్లో వస్తానని మర్నాడే వ్రాసివేశాను ఇంకా నాలుగుదినాలు వుండనగానే ప్రయాణ సన్నాహం ప్రారంభించాను వెళ్లేది అత్తవారింటికాయె; అందులో పండగకాయె, అందులో మొదటిసారాయె ఉన్నవాట్లల్లో ఉత్తమమైనవన్నీ రెండు పెద్దపెట్టెలనిండా సర్దుకుని, వర్జంలేకుండా నిర్ణయించబడ్డవారంనాడు బయల్దేరాను మాఅమ్మ వాకిలిదాకా వచ్చి- "నాయనా, జాగ్రత్తసుమీ ఎప్పుడూ పరాయిచోటికి వెళ్లివుండి ఎరుగవు ఎట్లా నిర్వహించుకొస్తావో వెంటపంపుతామంటే ఒక్క ఆడదిక్కైనా లేదు పోనీ నేనే వద్దామంటే, మీనాయనకు చేసిపెట్టేవాళ్లు లేరు. నానాయిబ్బందీ పడ్తారు కాన్లే, మూడురోజులే గదా, వాళ్లుమాత్రం నీ కేం లోపం జేస్తారు? ఏదన్నా కావలిస్తే మొహమాటపడకు బావమరిది వున్నాడుగా, అన్నా అడిగి చేయించుకో. మరేం తప్పులేదు." అని సాగనంపింది.

నాలుగుగంటలుమాత్రమే రైలుప్రయాణమైనప్పటికీ, వెళ్లేది అత్తవారింటికిగదాయని ఇంటరుక్లాసుటిక్కట్టు కొనుక్కొని, కంపార్టుమెంటంతా నాదేనన్న రీతితో కూర్చున్నాను రైలు కదలడానికి యింకా అరగంట టైం వున్నది పెట్టెలో నేను ఒక్కణ్ణే ఏకమేవాద్వితీయంగదా, హాయిగా వుంటుంది ప్రయాణం అని లోపల ఆనందిస్తూ, జరుగబోయే గౌరవ మర్యాదల్నిగురించి ఊహాగానం చేస్తూన్నాను —వెళ్లడం మొదటిమారుగదా, తప్పకుండా మామగారు స్టేషనుకు వస్తారు; బహుశః తోడిపెళ్లికొడుకు దెవరిదైనా మోటారుకారు తీసుకురావచ్చు, వెంటవచ్చే నౌకరు రెండుచేతులూ జోడించి దణ్ణం పెట్టి సామాను మోస్తాడు, దర్జాగా వెళ్లవచ్చు ఒకటేమిటి, లక్ష ఆలోచనలు దొర్లిపోయినై ఇంతలో ఏమి టాగాలిమేడలు అన్నట్టుగా-గార్డు ఈలవేయడం, పచ్చజెండా ఆడించడం, రైలు కదలడం అన్నీ ఒక్కమారు జరిగినై ఆ అవసానకాలంలో ఒక పొట్టి నల్లటి మనిషి ఒకచారలపెట్టె, రెండుమూడు మూటలు మోసుకుని, రెండుకాళ్లతుపానల్లే గభాలున తలుపుతెరిచి నాపెట్టెలో ప్రవేశించాడు

"ఇదికాదు, ఇదికాదు, ప్రక్కపెట్టెలో ఎక్కు" అన్నాను

"ఏం, ఎందుచేతనేం?" అన్నాడు శ్వాసకోసం వెనుకలాడుతూ

"ఏం, ఏమిటి? ఇది ఇంటరుక్లాసు కనపడ్డంలేదూ?"

"నాకూ ఆమాత్రం తెల్సు ఇడియట్ ననుకున్నావా?"

"భ్రమపడ్డాను" అన్నాను

రైలు సాగిపోతోంది ఆనల్లటిమనిషి పెట్టె భద్రపరచి, మూటలు మూలకు త్రోసి, కోటు విప్పి కొంకెకు తగిలించి, ఓవైపున కూలబడ్డాడు అతనివంక చూడ్డానికిగాని, అతనితో మాట్లాడ్డానికి కానిక్కి యిష్టంలేక, ఈన్న "హిందూ" పేపరు ముఖానికి అడ్డుపెట్టుకుని చదవడం ప్రారంభించాను అయిదునిమిషాలు అయిందో లేదో, అతను "ఇదిగో చూడండి, పత్రిక ఓమారు యిప్పించండి" అన్నాడు, చొరవగా వినీవినిపించకోనట్టుగా వూరొక్కన్నాను అందుచేత అతను మరోమారు పూర్వంకన్న బిగ్గరగా—"ఇదిగో చూడండి, మిమ్మల్నే. కాస్త ఆపత్రిక యిల్లా పారవెయ్యండి

అంటే, వినపడలేదూ?" అన్నాడు గద్గదస్వరంతో చెప్పద్దూ, నాకు కోపం వచ్చింది. కాని దిగమింగుకుని, "వినపడ్డదండీ. ఇది ఇంగ్లీషుపేపరుగదాయని వూరుకున్నాను." అన్నాను. ముప్ఫైరెండుపళ్లు బయటపెట్టి "ఏదో ఆమాత్రం యింగ్లీషు నాకూ వచ్చండీ. మీదయవల్ల బి. యే. బి. ఇడి. ప్యాసైనాను. యం. ఏ. కు ప్రైవేటుగా వెళ్లా లనుకుంటున్నాను. ఎప్పటికప్పుడు అల్లాగే అశ్రద్ధ అయిపోతోంది. ప్రస్తుతం బందరుహైస్కూల్లో మాష్టరీ వెలగబెడ్తూ నాలుగురాళ్లు సంపాదించుకుని భార్యాపిల్లల్ని పోషిస్తున్న సకుటుంబీకుణ్ణి. మరీఅంత తీసివెయ్యక్కరలేదు." అని సవినయంగా టూకీగా స్వీయచరిత్ర వెల్లడించాడు. పడ్డతొందరకి కొద్దిగా నాలుక కరచుకొని, మరోమాట మాట్లాడకుండా పైకాగితం తీసి ఆయనకు అందిచ్చి, తిరిగి పేపరుచాటున ముఖం దాచుకున్నాను. రెండు మూడునిమిషాల్లో ఆయన మళ్లీ ఎలుగెత్తి "చూడండి, యిది ఎడ్వరుటైజుమెంటుకాగితం. ఆ మధ్యకాగితం ఇప్పించండి" అన్నాడు. వొళ్లు మండింది. అణుస్వర తగలేసి పేపరు కొంటే, ఒక్కపేజీ అన్నా సరిగ్గా చూడ్డానికి ప్రాప్తిలేకుండా శిఖండిమోస్తరు అడ్డుపడ్తూన్న సైతాన్ని మనసారా తిట్టి పేపరంతా మడతపెట్టి "తమరు చూడండి. నేను సావకాశంగా తర్వాత చూస్తాను." అని అందిచ్చాను. ఆనందంతో అందుకొని తిరగవేయడం ప్రారంభించాడు. ఏమిచేయడానికీ తోచక, కిటకీలోంచి బయట చంక్రమణంచేస్తూన్న ప్రకృతిలీలావిహారాలను పరికిస్తూ, ఉన్నతభావాలకు, ఊర్ధ్వలోకాలకు పునాదులువెయ్యడం ఉపక్రమించాను. పట్టుమని పదినిమిషాలైనా జరగలేదు. వీపుమీద గుద్దినట్టుగా "అయితే చూడండి." అని సంబోధించాడు. అప్రయత్నంగా ఆయనవైపు చూచాను. పేపరు మడతపెట్టి విసురుకొంటూ "ఎందాకా?" అన్నాడు. కల్గిన విసుగునంతా క్రోడీకరించుకొని, "రైలు పోయిందాకా" అన్నాను.

"అంటే?"

"అంటే అదే. రైలు ఎక్కడ ఆగితే అక్కడదాకా."

"అయితే, బందరా?"

"ఊఁ."

"మనపేరు?"

..................

"ఊరు?"

..................

"బందరులో బంధువు లున్నారా?"

..................

"చదువా, ఉద్యోగమా?"

ప్రశ్నావళి హెచ్చిపోయి శ్రుతిమించి రాగానపడ్తోంది, ఊరుకున్నకొద్దీ. చివర సి. ఐ. డి ప్రశ్నలన్నీ వినేసరికి అరకాలిమంట నెత్తికెక్కింది. ముఖం ఎఱ్ఱజేసి ఒక్కసారిగా అన్నాను: "పేరు పార్థసారథి. ఊరు బెజవాడ. హరితసగోత్రం. ప్రవర జ్ఞాపకంలేదు. ఇరవైనాలుగో ఏడు. కాశీలో యం. ఏ. చదువుతున్నాను...... మీదగ్గర ఎవరన్నా పెళ్లికి ఎదిగిన గుంటలున్నారా ఏమిటి?"

ఇకిలిస్తూ, "కాదండీ——" అని ఏమోమో అనబోతుండగా అడ్డంవెళ్లి అన్నాను: "ఒకవేళ అటువంటి అపేక్ష ఏమైనా ఉన్నట్టయితే క్షమించాలి. అదృష్టంవల్లో, దురదృష్టంవల్లో పెళ్లి అయింది. ప్రస్తుతం అత్తవారింటికే వెడ్తున్నాను. కోదండరావుగారు మామామగారి పేరు. వకీలువృత్తి." అని పనసచెప్పాను.

"కోదండరావుపంతులుగారు తమరి మామగారాఅండీ, చెప్పరూ. మహాదొడ్డపురుషులు. మాస్కూలుకమిటీలో మెంబరు. మహాఉదారహృదయులు. వారి అబ్బాయికి——అదే మీబావమఱదికి క్రిందటేడు పరీక్షలముందు ఆరునెలలు రాత్రింబవళ్లు కష్టపడి ట్యూషన్ చెప్పాను. తత్ఫలితంగా ఈ సంవత్సరం నాఉద్యోగం ఖాయంచేయించారండీ. మహాఉదారస్వభావులు........ఆలాగా, చిత్తం——వారు మీమామగారాఅండీ, చెప్పరూ,...అయితే మీకు కావలసినవారన్నమాట...ఏదో వూరుకోక పలుకరించాను. చీకాకు పడ్డారు. కాని నాఅదృష్టం, క్రిందటిమారుమల్లేకాకుండా యీమాటు మంచిసహవాసందొరికింది." అన్నాడు దగ్గరగా జరిగి.

అతని ఫక్కీ చూస్తే చిత్రంగా కన్పడ్డది. అందుచేత ఏదన్నా వాగిద్దామని అన్నాను——"క్రిందటిమారల్లేకాకుండా అన్నారు, ఏమిటి?"

"ఏదోలెండి అయిపోయింది. కడుపుచించుకుంటే కాళ్లమీద పడ్తుంది. అదో నాటకం. బుద్ధి గడ్డితింది."

"అబ్బే, అట్లాకాదు. దాంట్లో ఏముంది. ఎవరికన్నా వస్తాయి కష్టాలు. ఏం జరిగిందో చెప్పాలి. మనలోమన కేమిటి" అన్నాను ఆప్యాయంగా.

అమాయకుడు పడ్డాడు వల్లో. ఇంకా కొంచెందగ్గరకు జరిగి షేక్స్పియరుమొహం పెట్టి ఊసు మొదలుపెట్టాడు.

"మీరు కావాలంటున్నారుకాబట్టి చెప్తున్నాను. కాని అది మన యిద్దరిమధ్యే. మూడోవాడికి తెలియగూడదు."

"అబ్బే.అంతేనండి. మళ్లీ తభావతా? నాకుమాత్రం తెలీయదూ." అనిఅభయహస్త మిచ్చాను.

ఉపక్రమించాడు.

"మొన్నండీ, మొన్నంటే మొన్నేనండీ, బందరునుంచి తెనాలి బయలుదేరాను. బందరుప్లాటుఫారంమీద పచార్లు చేస్తుం

డగా, ఓకంపార్టుమెంటులో ఒక్క స్త్రీయే కూర్చొనివుంది. చెప్పద్దూ మీకు, ఆడవాళ్లంటే అమితభయం నాకు. మాఆవిడె అల్లా అదుపులో వుంచింది. కాని ఆరోజేదేమో బుద్ధి వక్రించింది. రైలు కదిలేవేళకి ఆపెట్టెలో ఎక్కాను......బ్రహ్మాండమైన ప్రయత్నం మీద నేనుగూడా ఆపెట్టెలో వున్నానుఅనేవిషయం ఆవిడకు స్ఫురింపజేయగల్గాను. మెల్లగా సంభాషణ నడిపాను. తర్వాత గుడివాడలో ఆగినప్పుడు ఆవిడె మరచెంబుతో నీళ్లు తెచ్చిపెట్టమంది. దర్జాకు పోయి, స్పెన్సరుకలకు - అయిస్ నివేదించుకున్నాను. బెజవాడలో దిగినతర్వాత ఆవిడెపెట్టెలు మామూలుకూలీవాడిచేత మోయించడమేమిటి అనే అహంభావంతో చచ్చీచెడి సామానంతా, బుజాలు క్రుంగేటట్టు,నడుం పీక్కొచ్చేటట్టు వెయిటింగురూముదాకా మోశాను. హోటలునుంచి కారియరులో అన్నం అందించాను. తిరిగి సామానంతా తెనాలిబండిలో ఎక్కించాను. ఇక ఒకటేమిటి లెండి, పుచ్చినకుక్కల్లే 'అహం' అనేది చంపుకుని అడ్డమైనచాకిరీ చేశాను. చెప్పడం మరిచాను. బెజవాడస్టేషనులో వుండగా భోజనమైనతర్వాత అతిజాగ్రత్తగా ఒక్కకానీ చేతులోపెట్టి కిల్లీ కొనుక్కరమ్మంది. ఇంకోకానీ యిచ్చి నన్నుగూడా కొనుక్కొమ్మంటే ఏంపోయింది చెప్పండి ? ఇంతా అయింతర్వాత, ఒక్కసారైనా చనువిచ్చినవ్వుతూ మాట్లాడకుండా, చేసిన అరవచాకిరీని గురించి ఒక్క కృతజ్ఞతా వాక్యమైనా అనకుండా, నాతోపాటు తెనాలిలో దిగనైనా దిగకుండా చక్కా పోయింది. ఇంతకన్న ఏమన్నా వుందండీ ఘోరకలి. రామ, రామ, చెప్తే నమ్ముతారో లేదో, జేబులో దమ్మిడీ అంటే దమ్మిడీ లేకుండా, నాగడ్డి నేతిని, హల్లోలక్ష్మణా అంటూ అత్తవారింటికి జేరాను. వాకిట్లోకి చేరగానే అరవైఏళ్ల అత్తగారు ఆప్యాయంగా, "ఏం, బండిదొరకలానాయనా. పాపం నడిచేవచ్చావా ?" అనేసరికి గుండెకాయ మోకాళ్లదాకా జారిపోయింది. వచ్చిన కర్మం-వెళ్లింది అత్తవారింటికి. ఛా, ఛా, నానాభండాలం అయింది. అదేమిటోనండీ గ్రహచారం నాకెప్పుడూ యిటువంటి గ్రహచారాలే సంభవిస్తాయి. పూర్వజన్మసుకృతం అనుకుంటూ. ఏమిటోలెండి, వినవమండకు దొరికేవన్నీ......అన్నట్లు. ఇంతకూ నా మొగాన యిటువంటి అనుభవాలే వ్రాశాడుకాబోలు దేవుడు. ఊం ఏమిటోలెండి......మరిచిపోయినాను, అత్తగారు బట్టలు కొనుక్కోమని డబ్బిస్తే, కొంత ఖర్చుపెట్టి దర్జాగా ఇంటరుటిక్కట్టు కొనుక్కొని యిందులో పడ్డాను. అదృష్టభాగ్యంవల్ల మీసహవాసం లభించింది......అల్లాగా, కోదండరావుగారి అల్లుడుగారా మీరు, చెప్పరూ ? "

"అబ్బ, ఎంతకథ జరిగిందండి. గ్రీకుట్రాజిడీని మించిపోయింది. కాళిదాసువంటి కవిపుంగవుడికూడా అందనటువంటి బీభత్సరసవద్ఘటం. మీది నిజంగా రాతిగుండెకాబట్టి ప్రాణాలు నిల్పుకున్నారు. మరొకరైతేనా, పరాయి ఆడదానిచేతిలో అనవసరంగా పడ్డ పరాభవానికి ఉద్ధరిణెడునీళ్లల్లో పడి ప్రాణత్యాగం చేస్తారు. కాని, ఏమిటోలెండి, కష్టాలు యిల్లుకట్టుకు కాపరంచేస్తాయా ?"

"అవునండి. ఆభావాలు కల్గే నేనూ అనుజాయించాను. లేకపోతే యింతసేపా. మీరు చెప్పింది ముమ్మాటికీ నిజం. కాని ఏంచెయ్యను చెప్పండి. ఇంటిదగ్గర గంపెడు సంసారం. ఇంకా పుట్టేవాళ్లు, పెరిగేవాళ్లూను. జీవితం దుక్కమాలింది, మహాచెడ్డదండీ. ఆదర్శాలకు, అనుచరణలకు సమన్వయం చేసుకొచ్చేసరికి తాడు తెగుతుంది......"

"పాపం. నిజమేలెండి. మీరుమాత్రం ఏంజేస్తారు. అక్కడికీ సూక్ష్మబుద్ధితోనే ప్రవర్తించారు. కాస్తకూ, కూస్తకూ ప్రాణం తీసుకుంటామా ఏం ?—తీసుకుంటే తిరిగి రమ్మంటే వస్తుందా ? మరీ తప్పనిసరి వస్తేతప్ప, ఈశ్వరుడిచ్చిన ప్రాణం అనే సొత్తుతో మన యిష్టం వచ్చినట్లుగా చెలగాటం ఆడవచ్చు. తప్పుగాదండీ ?" అంటూండగా రైలు బందరు సమీపించింది. అది గమనించి, అతను తన మూటముల్లెకూడ దీసుకుని "మరి సెలవు. ఇక వెళ్లివస్తాను. తిరిగి ఊళ్లో దర్శనంచేస్తాను......మాగ్రంథమాలవిషయం కొంచెం ప్రసంగించాలిలెండి" అన్నాడు.

"మీగ్రంథమాలేమిటి ?"

"అంటూ ఒకటి లేవదీశాలెండి. సావకాశంగా చెవినేస్తాను. కాని మరోమనవి. మీమామగారితోమాత్రం నామాట, ఏభోజనం ముందో ఎప్పుడో, కాస్త చెవినెయ్యాలి. అశ్వమేధయాగం చేసినంత పుణ్యముంటుంది."

"అల్లాగేలెండి. దానికేముంది ?"

"చాలాథాంక్స్ అండీ...అయితే మరచిపోయినాను, మీపేరేమిటి యిందాక సెలవిచ్చారు ?"

"చెప్పినికామూ, పార్థసారథి అని...కాని యింటిదగ్గరమాత్రం పార్థఅని చలామణి."

"పార్థఅనేపేర పద్యాలు, కథలూ పడ్తూంటాయి పత్రికల్లో. మీరేనాఏమిటి ?"

"ఆహా, నేనే—అంటూ కూర్చున్నచోటునుంచి లేచాను, రైలు ఆగడం గమనించి.

"చెప్పరూ, ఎంతవారండీ. అల్లాగా, ఆ'పార్థ'మీరేనా ? మీవి చాలా చదివానుమండీ, మహాజోరుగా వుంటాయి."

"ఏమిటోలెండి. ఈరోజుల్లో ఆంధ్రవాఙ్మయానికి అన్నివిధాలా అరిష్టకదినాలు వచ్చినట్టున్నై. అడ్డమైనట్టుగా వ్రాసేందుకు వస్తాదులున్నారు. అవన్నీ ప్రచురించడానికి పత్రికలూ వున్నాయి. ఉదాహరణకు చూడండి, మీకు సంభవించిన ట్రాజిడీ వుందిచూడండి, 'అటువంటివన్నీ కథలుగా రూపాంతరం పొంది, తగుదునమ్మ

అంటూ వాఙ్మయరంగంలోకి ప్రవేశిస్తాయి. కుక్కగొడుగుల్లే పుట్టి గిట్టిపోయే "పత్రికారాజముల"కు ఏచేత్తయినా చాలు."

"అవునవును. మీరు చెప్పింది ముమ్మాటికీ వాస్తవం. నా మట్టుకు నేను, పత్రికాధిపతిఆహ్వానం లేనిదేనూ, నాలుగురాళ్లు రాలకపోతేను పత్రికలకు వ్రాయను. ఏది ఎట్లావున్నా, మన గౌరవ ప్రతిష్ఠలని అమ్ముకోకూడదు చూడండీ......" అని ఇంకేమో చెప్ప బోతూ, రైలు ఆగిందనే విషయం తెలుసుకొని, మామామగారు కంటబడ్తారేమో అనేభయంతో, శెలవుతీసుకుని గభాలున, ఎక్కినంతతొందరగానూ దిగి, అదృశ్యుడైనాడు.

ఇక నానాటకం:

సామానంతా ఓవారగా పెట్టి కిటికీలోంచి చూస్తూ నిలబడ్డాను—మామగారి ఆహ్వానాన్ని అందుకొనేందుకు సిద్ధంగా. కాని వెళ్లేవాళ్లేగాని నావైపుకు వచ్చేవాళ్లొకరూ కన్పడరు. అయిదు నిమిషాలయినతర్వాత, ఒకవేళ మామగారొచ్చి నేను కన్పడలేదని దేవుళ్లాడుతున్నారేమోనని, రైలుదిగి ప్లాటుఫారంమీద నిలబడ్డాను. ఎవ్వరొచ్చినజాడా కన్పడలేదు. తనకు వీల్లేకపోతే కొడుకు బ్రతికున్నాడుగదా, పోనీ వాణ్ణిఅయినా పంపకూడదా అని కోపం వచ్చింది. రైలుస్టేషనులోనే ఆగిపోయి, తిరిగి సాయంకాలంరైల్లో వెళ్లిపోదామా అని యోచనకల్గింది. కాని తమాయించుకున్నాను... చివరకు సామాను కూలివాడినెత్తిన పెట్టించుకుని స్టేషనుబయటికి వచ్చాను. దూరాన కారు కన్పడ్డది. దాన్ని బహుశః నాకోసమే పంపివుంటారని ఊహించి, కూలివాణ్ణి అడిగాను "అది లేడీ డాక్టరుగారిదండీ" అని ఘాటుగా జవాబిచ్చాడు. తిక్క తల కెక్కింది; విచారం విషమల్లే శరీరమంతా ఆవరించింది. కాని ఏం చెయ్యను? సరాసరి జట్కాబండిదగ్గర కెళ్లాను. దాన్ని ఎక్కబోతుండగా ఒకనౌకరు మెల్లగా పక్కకొచ్చి—"బా, ఆఅ...ఆబు, మీ...యీాయీ...యీా పేరేంటి?"—అని, వాడి నత్తితోపాటు తుంపరలతుపాన్ను అంతా నా మొహానే విడిచాడు. వొళ్లు మండిపోయింది. చేతులో రివాల్వరు లేకపోయిందిగాని, వున్నట్టయితే ఢమామని వాణ్ణి పేల్చేశేవాణ్ణి. ఎందుచేతనంటే, బందరంతా సి. ఐ. డీల మయమనీ, ఒకసారి అంటుకుంటే వదలరనీ, కాలేజీ విద్యార్థులదగ్గిరనుంచీ కద్దరు వేసుకుని ఆవృత్తికి లోబడ్తారనీ, కాఫీ హోటళ్లలో స్నేహం చేసుకొని, కుట్రకేసుల్ని పట్టియిస్తారనీ, అదీగాక వచ్చిపోయే కొత్తవాళ్లని ఆపాదమస్తకం పరిశోధించి అవస్థపెడ్తారనీ—అనేకం విన్నాను. అందుచేత వీడుగూడా ఆ బృందంలో జేరినవాడే అనుకుని విముఖత్వం చూపాను. కాని వాడు మామామగారి బంట్రోతని తెలుసుకుని, నత్తి వున్నదని గమనించి బాధపెట్టదల్చుకోక—"నేనే అల్లుణ్ణి" అన్నాను. వాడు వంగి వంగి దణ్ణాలుపెట్టి బండికి ముందు అధిష్ఠించాడు. నేనూ ఎక్కిన తర్వాత వాహనం కదిలింది.

పావుగంట, ఇరవైనిమిషాల్లో ఇల్లు చేరుకున్నాం. బండి దిగ్గానే బావమరది కాళ్లు కడ్డుపడి, సామాను జేరవెయ్యటంలో, బండివాడికీ నౌకరుకీ చేయూతయిచ్చి నన్ను లోపలికి ఆహ్వానించాడు. ఉంటాయి పదహారు, పదిహేడు ఏళ్లు. కాని కాయశరీరం—వామనావతారం అవడంచేత అంతకుతు వున్నట్టుగా అవుపించదు. —ఏటవాలునొసహం, కోలకళ్లు, చదరపుముక్కు—ఒకటేమిటి—వుండవలసిన అవలక్షణాలన్నీ వున్నాయి......ఓగదిలో గృహప్రవేశ మైనాను. బట్టలువిడిచి సావకాశంగా కుర్చీ ఆక్రమించాను. అత్తగారిపనే అనుకుంటాను—ఇంట్లోవున్న నగిషీవస్తువులతో గదంతా అలంకరించి వుంచి......పదినిమిషాలు జరిగినతర్వాత బావమరది కాఫీ-ఫలహారం పట్టుకొచ్చాడు. బలవంతంచేసినా తినకుండా (అలవాటుంటేగా!)—అన్నీ నాకే నివేదించాడు. సోదరి నివేదితను తలతన్ని పుట్టాడు అని లోలోపల నవ్వుకుంటూ, ఆట్టే మొహమాట పడకుండా చాలాభాగం ఆరగించాను. అప్పటికి నాలుగున్నరగంట లైంది. చీకటిపడకముందు స్నానం చేద్దామనే వుద్దేశ్యంతో శ్యాలకుణ్ణి పిల్చి చెప్పాను ఆజ్ఞలనన్నీ "శిరసాగ్రహ్ణామి"గా నెరవేరుస్తున్న అతను అన్నీ సిద్ధంచేసి వచ్చి లోపలికి కొంచుకుపోతుండగా మామగారు వేంచేశారు. సవినయంగా నిలబడ్డాను.

"స్నానానికి వెడ్తున్నావా?" అన్నారు.

"ఊఁ."

"అయితే పదకొండుగంటలరైల్లో బయల్దేరావా?"

"ఊఁ."

"ప్రయాణం కులాసాగా జరిగిందా?"

"ఊఁ."

"వంట్లో కులాసాగా వుందా?"

"......బావా, రావూ?"

"ఛీ, వెధవా! బుద్ధిలేదూ, మాట్లాడుతుంటే చావబాదేవేళ లేక......ఊఁ-మీయింట్లో అంతా క్షేమమా?"

"ఊఁ."

"సరే, నేను క్లబ్బుదాకా వెళ్లివస్తాను. ఇంట్లో వుంటావుగా."

"ఊఁ."

నిష్క్రమించారు మామగారు. 'నీళ్లాడ్డానికి' వెళ్లాను నేను.

* * * *

రాత్రి సుమారు ఎనిమిదిన్నరకి భోజనానికి లెమ్మని కబురు తెచ్చాడు శ్యాలకుడు. పాపం, అంతచాకిరీ అతనే. ఇంకెవ్వరు చేస్తారు మరి. మాఅత్తగారికి—మామగారికి—ఇంతవరకు ఒక్క కొడుకు, కూతురుమాత్రమే కల్గారు. వారు తర్వాత సంతానవృద్ధికై స్వయంకృషిగాని, దైవప్రార్థనగాని చేసినట్లు తోచదు. ఎందుచేత

సంటే, చాలావర్షాలు గడచినై. కొడుక్కి పదిహేడు; కూతురికి పదిహేను. మానవులయొక్క శక్తిసామర్థ్యాలు తెలుసుకోడానికిగాని, దేవుడుయొక్క ఆశీర్వచనం ఫలించడానికిగాని పదిహేనేళ్లు చాలు. మీఅభిప్రాయం అంతే ననుకుంటాను.

పిలుపు నందుకుని, పర్సుమాత్రం తీసేసి, బట్ట - బనీనుతో వంటింట్లోకి వెళ్లాను. తలుపుక్కన మెరసి గంతేసి పారిపోయింది, దొడ్లో వరాండాలోకి, ఒకఅమ్మాయి. తెల్లచీర జరీచెంగుమాత్రం దిజ్మాత్రంగా గోచరించింది. మాఅవిడే అయివుండాలి. కాని రూఢిగా చెప్పలేను. ఎందుచేతనంటే, రెండున్నరఏళ్ల క్రిందట పెళ్లిలో తలవంచుకుండగా ఏంచూశానో అంతే! తిరిగి చూడలేదు. అవకాశ మొస్తేగా! మన హిందూసంఘంలో వుండే దిక్కుమాలిన కట్టుబాట్లే యివి. బాధపడమని ఎంతమంది ఘోషిస్తే ఏంప్రయోజనం? ప్రవక్తలు, సంస్కర్తలు పుట్టిపోతూనేవున్నారు. మనం, మనసంఘం, కల్మషం– యిట్లాగే వున్నాం. అచలాయతనం- కాదండీ మన జీవితమకుటం–మరి!...... సరే ఈనీతిబోధల కేంగానిండి, పెళ్లిలో సరిగాచూడనిమాట వాస్తవం. మీతోడుసుమండి! అందుచేత యిప్పుడు మనస్సు ఆఅమ్మాయి నిష్క్రమించినవైపు జోరబడి కొంచెం సంచలనం చెందినమాట రూఢి మళ్లీ ఎందుకు మీతో అబద్ధం చెప్పడం. కాని అన్నిభావాలు సమరతితో బిగబట్టుకొని–నాకేగదా అని వూహించి వెండికంచం వున్న ఆసనం ఆక్రమించాను. అంతవరదాకా, నాసికాగ్రం హస్తాగ్రంతో మూసుకొని విశ్వామిత్రుడు పోజుబెట్టి, ఉద్ధరిణెడు నీళ్లతో ఊర్ధ్వలోకాల్ని దర్శిస్తూ తపస్సమాధిలో మగ్నుడైయున్న మామగారు, మేనక అప్సరాంగనావతరణంచేత భగ్నపరుపబడినవాని వలె కళ్లుతెరిచి నావంకచూచి, నివ్వెరబోయి, కొంచెం వొత్తిగిలి,

"అయితే పట్టుబట్ట తేలేదూ?" అన్నాడు.

"ఊఁహూ."

"బనీనుగూడా విడవడం మానేశావా?"

"లేదు. కొంచెం చలిగావుంటేను."

"చలిగావుందీ. చలి. మేమంతా మనుష్యులం గామూ. చలివుందనుకుంటే వుంది; లేదనుకుంటే లేదు. మొన్నే క్లబ్బులో చెప్పారు. ఇటీవల నవంబరులో మనమహర్షి సాంబమూర్తిగారు ఉత్తరహిందూస్థానం వెళ్లినప్పుడు కాశీలో తెల్లవారుఝామున నాలుగున్నరకే లేచి గంగలో స్నానం చేసేవారట. రాత్రిళ్లుకూడా అట్లాగే అంగవస్త్రంతో వుండేవారట. యూనివర్సిటీ విద్యార్థులందరూ ఫ్లానలుసూట్లు, సర్జికోట్లు, పుల్ ఓవర్లు, స్వెటర్లు, స్కార్ఫులు దట్టంగా వేసుకుని, "ఇక్కడ చలి చాలా తీవ్రమండీ, శాలువగాని, రగ్గుగాని కప్పుకోండి" అని ఆయన్ను బ్రతిమాలుకున్నప్పుడు, "ఛలా, ఎక్కడ నాకేం అనిపించడం లేదే."–అని ఆంధ్ర అసోసియేషను మీటింగులో హాస్యంచేసారట. నీకు తెల్సుగా కాశీలో ఎంతచలో"

నేను మొండికేసి కంచంవంకే చూస్తూన్నాను. జవాబు చెప్పలేదు. ఇంతలో, నా అల్లుడుతనంమీదికి ఎగిరివచ్చే మామగారి బాణాన్నికి అత్తగారనే సుదర్శనచక్రం అడ్డుపడి, "పోనీండి. ఎల్లా కూర్చుంటే ఏం? విస్తళ్లు ఎడం, ఎడంగానే వున్నాయిగా. మీరు కావలిస్తే యింకా కొంచెందూరంగా జరుపుకోండి...అందరూ ఒకేమోస్తరు రుంటారూ?" అని ఎత్తిపాడిచింది, వడ్డనసాగిస్తూ. అత్తగారు నాపక్షమేగదాయని ఆనందించాను. కాని మామగారేనా మెత్తగా వూరొక్కనేవాడు? అగ్నిపర్వతంలాగ పేలి—"ఛండాలం ముండా, నువ్వూ చెప్పేదానివే నాకు; సిగ్గులేక" అని గర్జించాడు. ఆధాటికో, లేక విధివశాత్తుగానో తెలియదు, పైన దండాన ఆరవేసిన గావంచా త్రుళ్లి క్రిందపడ్డది. నా సందెల్లో రాయి ప్రవేశించింది. మామగారి వైఖరీని గురించి, కోపాన్ని గురించి, శబ్దజాలప్రయోగాన్ని గురించి, యిదివరకే విన్నానుగాని, స్వయంగా అనుభవం లేదు.



"ఏమిటి నీపిండాకూడు.........రేపే నేతితప్పాలా బయటపడేస్తావా ఏం?"

అందుచేత యీస్వల్పందానికే చెదిరిపోయి, భోజనం సర్వంగా ఎల్లా వెళ్తుందాఅనే సంశయంలో పడ్డాను. నా ఎడంప్రక్కను కూర్చున్న బావమరిదికి ముఖాన నెత్తురు అప్పుడే నిష్క్రమించింది. అత్తగారు ఆశ్చర్యం హడిలిపోయి కిక్కురుమనకుండా వడ్డనపూర్తిచేసింది. నాకు మొదట్లో కొంచెం భయమేసిందన్నమాటేగాని, ఎంత చెడ్డా అల్లుణ్ణి గదా, తలతిక్కగా వుంటేమాత్రం వచ్చిన నష్టమేమిటి అనే ధీమాతో వున్నా.

కలియబడ్డాం!

భోజనానికి! వణుకుతూన్న చేతుల్తో అత్తగారు నేతిజారీ పుచ్చుకొని, చాలు అన్నా ఆగకుండా ఓపావునేరు గుమ్మరించింది కంచంలో చూశాడు యజమాని. ఛప్పున కన్నెఱ్ఱజేసి, ముక్కోళ్లు ఎత్తిపెట్టి: "ఏమిటి నీపెండాకూడు, సత్రభోజ్య వ్యాపారంగా వుంది. అంతంతబోర్లిస్తా వెందుకు? రేపేనేతి తప్పాలా బయట పడేస్తావా ఏం? ............... అదేమిటి నీబొంద. ఆవకాయ వులు అంతంత వడ్డించావు కంచంచుట్టూ-గేదెకట్టు మొదిలల్లే. కావాలిసి వుంటే అడిగివేయించుకోమా. మొహమాటమా ఏం?" అని స్వరయుక్తంగా పనస ప్రారంభించాడు. ఇటువంటి ధాటీలకు అల వాటుపడ్డ అత్తగారు లక్ష్యంచేయకుండా తనపని చూచుకుంటోంది. నాకు లోపల నవ్వూ వస్తోంది, రోషమూ వస్తోంది. కాని ఏమీ అనలేక నాపనిమీద నేనున్నాను. మామగారు లోటులేకుండా అడిగివేయించుకుని తింటూ, అటూయిటూ చూపుతో తనిఖీ మొదలుపెట్టాడు...గ్రహచారం...కంటపడ్డాడు!—కొడుకు, నోరు తెరవడానికి భయపడి, విస్తట్లో వున్న ఆవకాయ ఒకదానిమీద వ్రేలుపెట్టి, అది కావాలి అని తల్లికి సంజ్ఞచేశాడు. పట్టుకున్నాడు తండ్రి: "దరిద్రుడా! పానకాలరాయడ్ని, బాజీరాయడ్ని మించి పోతున్నావేం? సత్రాలవెంబడి పంపుతా రేపటినుంచీ——" అన్నాడు. నాకు ఫక్కున నవ్వువచ్చింది. సహించుకుని, మామగారివైపు తిరిగి "పోనీండి, చిన్నపిల్లాడు. ఎందుకల్లా కసురుతారు?" అన్నాను.

"చిన్నపిల్లాడు...చంటిపిల్లాడన్నావుకాదు, నయం రేపు రోగమొస్తే ఎవరు చేస్తారు? సంపాదనంతా తిండికీను డాక్టర్ల బిల్లుకేనా? అవ్వతీసిన గంధం...సరిలే! అల్లా వుంది."

నేను మరేమీ అనలేదు. ఇంతలో అత్తగారు వినీవిననట్టు కుండా "చాలు, నాటకం" అని ముఖం చిట్లించుకొని, "ఒసే అమ్మాయి, అరొమ్మలులో వున్న వెండిగిన్నె యిలా పెట్టిపోవే. మర్చిపోయినాను." అని పొలికేక పెట్టిందిమా ఆవిడేగదా వచ్చి యివ్వాలిసింది. తప్పనిసరిగా కంటపడ్తుంది అని ఉవ్విళ్లూరుతూ, ద్వారంవంక కొంచెం దొంగతనంగా చూడ్డం ప్రారంభించాను. చూస్తూనేవున్నానుసుమండీ, కాని అదృష్టంమినహా అన్నీ వున్నాయికాబట్టి ఆ అమ్మాయి మేము కూర్చున్న తట్టున వెనకవున్న ద్వారంలోంచి వచ్చి, ఆత్రంతో గిన్నె మావెనక జారవిడిచి చక్కా పోయింది. గిన్నె చప్పుడవడం, మామగారు గర్జించడం—రెండూ ఒక్కమారే సంభవించినై "ఉండాలా, వూడ్చిపెట్టుకుపోవాలా. పాడుపిల్లా, ఎన్నిసార్లు చెప్పాను శ్రద్ధగా వుండమని!" అన్నాడు. శ్యాలకుడు గిన్నె అందుకొని నాకు అమర్చాడు. అత్తగారు పాయసం వడ్డించింది. ఆద్రవం ఏమిటో తెలియక ఓగరిటెడు పోసిందాకా ఓపికపట్టి, చెయ్యి అడ్డుపెట్టాను. ఆవిడకు ఏంచెయ్యడానికీ తోచక చూస్తూండగా యజమాని అందుకుని. "ఊఁ, చాలుట. తెలియకుండా కావలిస్తే అడుగుతాడులే" అన్నాడు. "అబ్బే, చాలడం, చాలకపోవడం కాదు. నాకు పాయసం సయించదు" అని విన్నవించాను.

"సహించదూ. నిక్షేపం లాగుంటేను కాఫీహోటళ్లల్లో అయితే వెళ్తుందీ లోపలికి." అని ఎత్తిపొడిచాడు. ఊరొక్కన్నాను. అదొక్కటే భక్ష్యం అవడంచేత, అది నేను ఆరగించక పోవడంచేత అత్తగారి నవనీతపు మనస్సు చివుక్కుమని, "నా చేతులు పడిపోనూ. అల్లాగని తెలిస్తే మరోటే చేసేదాన్ని" అన్నది సన్నగా. విన్నాడు పాములచెవుల మామగారు. "ఏం, దీనికేం, తెగులా, పెద్దరోగమా. అందరి యిళ్లల్లోను యింతకంటె ఎక్కువ చేసుకుంటారా?" అని ధుమధుమలాడుతూ, తాను మరినాలుగు గరిటెలు వడ్డింపించుకొని, క్షీరాన్నంయొక్క గుణగణాల్ని విశదీకరించి పొగుడ్తూ జుర్రడం ప్రారంభించాడు. నక్క-కొంగ కథ జ్ఞప్తికి వచ్చి నవ్వుకొన్నాను. తర్వాత, పెరుగు వడ్డించేటప్పుడు మరింత రాద్ధాంతంతో—అక్కడికి భోజనకాండ సమాప్తి.

సరాసరి నాకు ఏర్పరచబడ్డ గదిలోకి వచ్చి ఈజీచైరులో విశ్రమించాను. శ్యాలకుడు తాంబూలంతెచ్చి బల్లమీద పెట్టివెళ్లాడు. అంతలోకే మామగారు ప్రత్యక్షమై, "ప్రయాణ బడలిక వుంటుంది. పడుకో. మాట్లాడేది ప్రత్యేకం ఏముంది?" అని నేనేమీ బదులుచెప్పక పూర్వమే చక్కా పోయినాడు. చేసేదేమీ కన్పడక, తాంబూలం వేసుకోవడం పూర్తిచేసి, ఎలిక్ట్రిక్ లైటు ఆర్పేసి పాన్పుమీద ఒరిగాను. భుక్తాయాసంచేత కొంత, క్రొత్తస్థలం అవడంచేత కొంత, చాలాసేపటివరకు నిద్రపట్టక ఆలోచనాపరంపరలు విజృంభించినై. రైల్లోనే స్పష్టమైన నల్లటిమనిషి, తిక్కశంకరాయి అయిన మామగారు, తటిల్లతాప్రభతో మెరసి మాయమైన మాఆవిడే-వరుసగా తలపుకు వచ్చినై. తుద కెప్పుడు నిద్రపట్టిందో నాకే తెలియదు.

* * * *

కొంతజాము గడచిపోయింది. బహుశః పన్నెండుగంటలు అయి వుంటుందేమో అనుకుంటూ—లోపలయింట్లోంచి కేకలు, రాద్ధాంతం వినబడ్తోంది. రంగం వంటింటివైపు అవడంచేత మాటలు స్పష్టంగా వున్నాయిగావు. కాని, మామగారు, అత్తగారు ఏదో వాగ్యుద్ధంలో ఉన్నారనిమాత్రం సుబోధకమైంది. ఇంటివ్యవహారాలేమైనా నేమో నని ఊరొక్కన్నా. మరికొన్ని నిమిషాలకు వారిద్దరూ ఒక రొకరు

తెరుచుకుంటూ, నేను పడుకున్న గదికి ఎడమవైపునున్న మామగారి ఆఫీసుగదిలోనికి వచ్చారు. ఆయన గబగబా ఏదో డ్రాయరులాగడం వినబడ్డది. అత్తగారు అంటోంది: "ఊరుకోండి, బాగుండదు. అతను వింటే బాగుండదు ఇంతకూ మనం కంటితో చూడ లేదాయె. దొంగతనం కట్టడం ధర్మమా?" "చూడకపోతే మాత్రం, అతనుతప్ప యింకెవ్వరు రావడానికి అవకాశం వుంది? దరిద్రం లుచ్ఛా. ఇంటికి పండగకని పిలిస్తే యింతపని జేస్తాడా! తెల్లవారనీ, పోలీసులాకప్పులో వేయించి మక్కెలు విరగేయించి, డబ్బు కక్కి స్తాను. ఫుంఖాకోర్ వెధవ."

"ఊరుకోండి, ఊరుకోండి. బాగుండదు. పక్కగదిలోనే పడుకున్నాడు. వినబడ్తుంది. నేను తగ్గినకొద్దీ, మీరు హెచ్చుతారేం? .........పోనీండి, నా కాసులపేరు తీసుకు ఖర్చుపెట్టండి. మీ నాలుగువందలు మీకు వస్తాయి."

"అప్రాచ్యపుముండా. నీ కాసులపేరు అడ్డమేసి అల్లుడి దొంగతనం దాస్తావా? వాడు చేసిన అపభ్రంశంపని నచ్చిందేం? ఇల్లాంటి అత్త లుండబట్టే అల్లుళ్ల ఆటలు సాగుతాయి. కాశీచదువుకు వెడ్తానని, రామేశ్వరంయాత్ర చెయ్యాలని, తిరుపతిమొక్కు తీర్చుకుంటానని—మామగార్లకి ఉత్తరాలు బరాతం. అవేమీ జరక్కపోతే గదిలోకి పోనని, అమ్మాయిని వల్లనని, మీ గడపెక్కనని బెదిరింపులు. కుంతముండావాళ్లు. అన్నింటికి అత్తగార్ల ఆమోదన. అల్లుళ్ల కోర్కెలు తీర్చిందాకా యింట్లో రొమ్ముమీద కుంపటివతు. దిక్కుమాలిన ఆడజాతి......ఇవన్నీ యిల్లా వుండగా, నీపోరు పడలేక, పోనీ పండక్కి నాలుగు మెతుకులు తినిపోతాడు, మళ్లీ దూర దేశం వెడ్తాడు గదా అని పిలుస్తే—నాలుగువందలరూపాయల నోట్లూ అమాంతం మాయంచేస్తాడా. వొళ్లు మండిపోతోంది. చెవు లేక్కసి యిప్పుడే అడుగుతాను."

"వద్దు, వద్దు నామాట వినండి. దణ్ణం పెడ్తాను. తెల్లవారనీండి, పోనీ మీసందేహం అట్లాగే తీర్చుకుందురుగాని. మీరు కాకపోతే, నేను అడిగి తెల్సుకుంటాను. పోలీసుదాకా వెళ్ళకండి. నలుగురినోళ్ళల్లోనూ పడ్డంతప్ప వేరే ఏం లేదు. ఇప్పటికే మన సంగతంతా ఊళ్లో తెలుసు. నామనవి వినండి"

ఇంతలో నాగదితలుపు తోసినట్టుగా శబ్దమయ్యేసరికి కన్నెత్తి చూచాను. నల్లటి చీకట్లో, తెల్లనిదుస్తులు ధరించిన వ్యక్తి వాకిలి దగ్గర గోచరించింది. చావగొట్టడానికి మామగారే పరశురామావతార ప్రభతో వచ్చారేమోనని బెదిరిపోయాను. కాని కొంచెం నిదానంగా చూస్తే స్త్రీరూపం. అత్తగారేమో ననుకున్నాను. కాని పోలిక సరిపోలేదు. కాని మాఆవిడేమో ననుకోడానికి ఆశ్లే ఆధారాలూ కన్పడలేదు.

రెండుమూడు నిమిషాలు ఆవ్యక్తి అక్కడే తలుపుదగ్గర నిలబడ్డది. ధైర్యం తెచ్చుకొని పలుకరించాను.

"ఎవరు వారు?"

........................

"ఎవరు వారు?"

"నేనే—" మా ఆవిడగొంతు స్ఫురించింది.

"ఎందుకు రాధా?"

.....................

"ఎందుకు యిప్పుడు వచ్చావు?"

"కొంచెం మాట్లాడ్డానికి—"

ఏమీ అర్థంకాక, మంచం దిగి స్విచ్ వెయ్యబోతుంటే "వద్దు" అన్నది. దగ్గరకు వెళ్లి అప్రయత్నంగా రెండుచేతులూ రాధభుజం మీద వేసి, మంచందాకా తీసుకెళ్లి కూర్చోపెట్టాను. ఇంకా తల వంచుకునేవుంది.

"ఏమిటి విషయం చెప్పు" అని చేత్తో రాధముఖం పైకి యెత్తాను. కన్నీళ్లు కారిపోతున్నై.

"ఎందుకు ఏడుస్తున్నావు?"

..................

"చెప్పు, ఫరవాలేదు. ఎందుకు?"

"చెప్తాను, కోపం రాదుగదా?"

"రాదు."

"నేను చెప్పినట్టు చేస్తారా, మరి?"

"ఏమిటో చెప్పు."

"చేసి తీరాలి. లేకపోతే బ్రతకను."

"చేస్తాను, చెప్పు."

మా నాన్నగారు ఆఫీసుడ్రాయరులో, సాయంకాలం క్లబ్బుకుపోతూ, పార్టీ యెవరో యిచ్చిన నాలుగువందల రూపాయలకట్ట పెట్టారట. ఇందాక అరగంటక్రింద చూస్తే లేదుట. మీరు తీశారని ఆయననమ్మకం. ఊరుకోమని అమ్మ ఎంత బ్రతిమాలినా వినడం లేదు. రేపు పోలీసుల్తో చెప్తారేమోగూడ"

"నామీదే ఎందుకు ప్రత్యేకంగా అనుమానం?"

"సాయంకాలం మీరేగా యింట్లో వుంది. ఈగదిలోంచి మెల్లగావచ్చి తీశారని నమ్మకం."

"డ్రాయరు తాళంవెయ్యలేదా?"

"వేశారు. కాని యధాలోపాన తాళంచెవులు బల్లమీదనే మరిచిపోయినారట."

"నౌకర్లు తీసివుండకూడదూ?"

"ఇద్దరు నౌకర్లూ, దాసీది, చిన్న అయిదింటికే వెళ్ళిపోయినారు."

"మీ అన్నయ్య ఏమైనాడు?"

"వాడు ఆడుకోడానికి వెళ్ళివచ్చి, మీతోపాటు భోజనం చేసి పడుకున్నాడు."

"అయితే యిక మిగిలింది నేనే నన్నమాట. అందుచేత నా మీద అనుమానం బాగానే వుంది. మీనాయన వచ్చి పోనీ నన్ను అడుగుతాడా?"

"అడుగుతే అడుగుతారేమో తెల్లవారి. లేకపోతే పెంకె మనిషి. సరాసరి వెళ్ళి పోలీసులలో రిపోర్టుయిస్తారేమో.. ...అబ్బా! భయమేస్తోంది." అని వెక్కి వెక్కి ఏడుస్తూ నా చేతుల్లో మొహం దాచుకుంది.

దగ్గిరగా తీసి, పమిటకొంగుతో కన్నీళ్లు తుడుస్తూ అన్నాను—"ఏడవద్దు. ఏం చెయ్యాలో ఆలోచించు. యథార్థానికి నాకేం తెలియదు."

"అవును. లేకపోతే నీ మీద మోపి తీస్తారా. ఆయన కేమో మతిపోయి మిమ్మల్ని అంటున్నారు కాని."

"అదే యిప్పుడు విచారించవలసింది. నిందారోపణజేసి అల్లరి పెడ్తాడేమో?"



"అని నడుమునుండి ఆభరణంతీసి చేతులో పెట్టింది"

"అందుకే వచ్చాను. ఇదిగో వడ్డాణం. ఉంచండి. తెల్లవారి త్వరగా అంగడికివెళ్ళి, వస్తువు మార్చి పైకం తీసుకురండి. నాలుగు వందలకు పైగా వస్తుంది. నవరున్నభరి హెచ్చుగా వుంది." అని నడుమునుండి ఆభరణం తీసి చేతులో పెట్టింది.

"అంతపని నాచేతుల్తో చెయ్యనా? వేరేమార్గ మేమీ లేదా?...ఇంతకూ నేనేమీ ఎరగనే. డబ్బు యిస్తే నేరం వొప్పుకొన్నట్టు కాదా? అదిమాత్రం అపర్దిష్ట కాదా?"

"నిజమే..... పోనీ, ఓపని జేదాం. మీరు డబ్బు పట్టుకు రండి. నేను తిరిగి దాన్ని డ్రాయరులో రహస్యంగా పెడ్తాను. ఆయనే చూసుకొంటాడు."

"ఆఆలోచన బాగానే వుంది. కాని నామనస్సు యింతపనికి వొప్పుకోవడం లేదు."

"నాకోసం చెయ్యండి. దణ్ణం పెడ్తాను. ఇందాకటినుంచీ నా గుండె బ్రద్దలై పోతోంది." అంటూ రెండుచేతులూ పట్టుకుంది.

మనస్సు కరగింది. రాధ చెప్పినట్టే చేద్దామని నిశ్చయించుకున్నా. సరేనని మాట యిచ్చాను...రాధముఖం విప్పారింది. కన్నీళ్లు కట్టినై. ముఖం తుడుచుకుని, వడ్డాణం నాతలగడక్రింద భద్రపరచి, "తెల్లవారగానే ఆలస్యం చెయ్యకుండా పని పూర్తి చెయ్యండి. వెళ్తాను" అని లేచి నిలబడ్డది.

"వెడ్తావా?"

"ఊఁ."

"మరి, మీ నాన్న నీవడ్డాణ మేదని అడుగుతే?"

"ఏదో చెప్తాను...తర్వాతసంగతి అది."

"నాకోసం వడ్డాణం దానంచేస్తావా?"

"ఇందులో పెద్దదానమా? తర్వాత మీరు సంపాదిస్తే తిరిగి చేయించకోకూడదా? అయినా వడ్డాణమెందుకు నాకు? ఎవరికి ప్రీతి నగలంటే..... మాదొడ్డమ్మగార్ని ఎరుగున్నారుకాదూ. ఆవిడె తన నగలన్నీ విద్యార్థులకు దానంచేసింది. దొడ్డయిల్లాలు. చదువంటే అంత ఆపేక్ష. దానము ధర్మము అంటే ఆమెర్దా...... నా కెందుకు నగలు. అన్నిటికి మీరే వున్నారు......వెడ్తాను."

"ఊఁ. వెడ్తావా?"

"ఊఁ."

"వెళ్లిపోవడమేనా? నీయొక్క మాటలచేత, చేష్టలచేత నా హృదయకుంజంలో ఆనందాన్ని పల్లవింపజేశావు. ఉన్నతభావాలతో ఉత్తేజితుణ్ణిగా జేశావు. నా భాగ్యానికి గర్విస్తాను...... ఒక్కమారు......వెళ్లడమేనా?".........

జవాబులేదు. ఆమెకళ్లుమాత్రం నవ్వినట్టుగా కనపడ్డాయి. చెయ్యి చాచాను...అందుకుంది. దగ్గరకు తీశాను......

............................

చెదిరిన మాలతీచెండును, నలిగిన చీరెను సర్దుకుని, త్రపతో తలవంచుకుని, "ఇక వెళ్లి వచ్చునా?" అన్నది మెల్లగా. ఏమీ అనలేక నవ్వాను. తనూ నవ్వుతూ చీకట్లో మెరుపుతీగల్లే మెరుస్తూ, తిరిగిచూడకుండా వెళ్లిపోయింది.

క్షణమాత్రమే సంభవించిన సౌఖ్యాన్నిగూర్చి అదృశ్యమైన ఆనందమూర్తినిగూర్చి ఆలోచన నెమరవేస్తూ పడుకోగా, జరిగిన కలహం, జరుగనున్న యుద్ధకాండ తలపుకు వచ్చినై. కలతనిద్దరతో తెల్లవారింది.

* * * *

కాలకృత్యాలు తీర్చుకుని, ఛప్పున దుస్తులు వేసుకుని బయల్దేరాను. శ్యాలకుడు ప్రత్యక్షమై "బయటికి వెడ్తున్నావా బావా? ఉండు కాఫీ త్రాగి వెడ్దుగాని."

"కాఫీ లేదు, నీమొహం లేదు. మాట్లాడకు."

"ఎందుకు, కోపంగా వున్నావు?"

"కర్మంచేత—' అని ఉత్తరీయం మీదవేసుకుని చర్రున బయటికి బయల్దేరాను. వాకిలిదాకా వెళ్లేసరికి మామగారు ఎదురొచ్చారు. ఆగాను.

"ఎక్కడికి బయల్దేరావు ప్రొద్దున్నే?"

"బయటికి."

"ఎందుకు?"

"పనుండి."

"ఏం పని?"

"ఏదైతేనేం?"

"అల్లాగేం? సరే అయితే......నేను నీతో మాట్లాడాలి."

"మాట్లాడవచ్చు."

"నిన్నొకవిషయం అడగదల్చుకున్నాను, నిష్కర్షగా."

"అడగవచ్చు."

"నిన్న సాయంకాలం నాఆఫీసు డ్రాయరులో నాలుగువందలరూపాయల నోట్లకట్ట పెట్టాను. రాత్రిమాస్తే కనపడలేదు."

"అయితే?"

"ఆవిషయం నీకేమన్నా తెలుసా?"

"ఎల్లా తెలుస్తుంది?"

"తెలియదేం?......అంచేతే. నీమీద నాకు అనుమానముంది!"

"సరే అయితే?"

"ఏమిటి ఆమొండితనం...మర్యాద వుండక్కర్లేదూ?"

"సరే."

"ఆమొండితనమే వద్దన్నాను. ఇచ్చేసెయ్యి; డబ్బు."

"ఇవ్వకపోతే?"

"ఏం చెయ్యాలో అదేచేస్తాను. తఢాకా చూడు."

"సరే."

"మర్యాదగా యిచ్చెయ్యి."

"నిజం చెప్తాను. ఆవిషయం నాక్కేం తెలియదు. మీఅనుమానం, ఆగ్రహం—అంతా ఆధారంలేనివి. ఎందుకు అనవసరంగా గల్లంతుచేస్తారు?"

"గల్లంతు, గిల్లంతుచేస్తున్నానేం? నాలుగువందల రూపాయలు, కష్టపడి చెమటోడ్చి సంపాదించినవి పోతే నోరుమూసుకు ఉండమన్నావేం?"

"అయితే నామీద ఎందుకు అనుమానం?"

"నువ్వుతప్ప తస్కరించడానికి మరెవ్వరికీ అవకాశం లేదు. నౌకర్లు లేరు. అబ్బాయి ఆటకి వెళ్లాడు. ఆడవాళ్లు యింట్లో పనిలో వున్నారు. నీగదిలోనుంచి ఆఫీసులోకి ఉన్న ద్వారం తెరిచేవుంది. ఆసమయం కనిపెట్టి చేచిక్కించుకొనివుంటావు."

"అల్లాగేనని నిశ్చయించుకొన్నారా?"

"ముమ్మాటికి."

"అయితే సరే. ఏంచేస్తారో అది చెయ్యవచ్చు."

"సరే, సరే. ఆమొండి 'సరే' ఏమిటో తెల్పిస్తాను. దబాయిస్తే సరిపోతుందనుకున్నావేం? ఆపొగరుబోతుతనం వదలించి, డబ్బు కక్కిస్తాను. కబడ్దార్."

"సరే."

"అదే, అదే, ఆజులుబునీళ్లే వదలిస్తాను."

"సరే"........

ప్రాణం విసుగుపెట్టి, ముఖం చిట్లించుకొంటూ గబగబా లోపలికి వెళ్లిపోయినాడు. నాత్రోవన నేను అంగడికి నడిచాను.

* * * *

గంటన్నర గడిచింది. బజారు వెళ్లి కార్యం చక్కబెట్టుకొని తిరిగివచ్చాను. వచ్చి గదిలోకి ప్రవేశించగానే రాధ మెల్లగా

వచ్చింది. నాలుగువందలనోట్లకట్ట అందిచ్చి, "పైన యింకా అరవై రూపాయలు వున్నాయి." అన్నాను.

"అవి మీదగ్గర వుంచండి. ఇవి నేను డ్రాయరులో పెడ్తాను చప్పుడుకాకుండ." అని సంతోషితస్వాంతంతో నిష్క్రమించింది. మరి ఐదునిమిషాలకు అత్తగారు కాఫీ–ఫలహారం పట్టుకొచ్చి నా ప్రక్కన బల్లమీద పెట్టి, గడపదిగి కొంచెం చాటుగా నిల్చుని, "ఎందుకు అంతతొందరగా వెళ్లారు, ప్రొద్దున, కాఫీయైనా త్రాగకుండా?...తీసుకోండి. (అని నేను నిశ్శబ్దంగా వుండడం గమనించి రెండునిమిషా లుండి) మామగారి కేకలకు ఏమీ అనుకోవద్దు. వారి ధోరణి ఎప్పుడూ అంతే. ఏళ్లువచ్చినకొద్దీ ఆగ్రహం ఎక్కువవుతోంది"

"అవును. ప్రొద్దున నాదగ్గర కొచ్చారు."

"మీవద్దరకా? ఎప్పుడు? నాకు తెలియదే."

"వచ్చారు. వచ్చి రాత్రికాండను గురించి అడిగారు."

"నిజంగానా నాయనా?.. ఆయనకు అదేం పోయేకాలం. నేను అల్లా అడగవద్దన్నానే. అయ్యో యిదేం పాపం!"

"అడిగారు, పోయినడబ్బువిషయం!"

"అయ్యో, అయ్యో, అపర్దిష్ట! ఇంటికి పండక్కని పిలవడ మేమిటి, యీ లేనిపోని మాట లేమిటి!"

ఇంతట్లో వాకిటిముందర మోటారుకారుచప్పుడు, బైసికిలు గంటచప్పుడు. ఎవరో వచ్చారని అత్తగారు లోపలికి వెళ్లింది. ఎవరో మామగారికోసంకాబోలు అనుకొని, కాఫీగ్లాసు, న్యూసు పేపరు దగ్గరకు తీసుకొని, ఈజీచైరులో జార్లగిలాను. ప్రక్కఆఫీసు గదిలో మామగారిది, మరి అయిదారుగురివి గొంతుకలు వినబడ్డాయి. తరువాత క్షణంలో నాగదితలుపుకు అడ్డమున్న తెరచాటునుంచి 'శార్, శార్' అని వినబడ్డది.

"ఎవరూ?"

"శార్!"

"ఎవరూ?"

కర్టను తొలగించి, ఎర్రజరీతలపాగా పెట్టుకుని, కాకిషార్టు, షర్టు అలంకరించుకున్న అయ్యంగారు సబ్ యిన్స్పెక్టరు అవతరించాడు.

"ఎవరికోసం?"

"మీకోసమే, శార్"

"అయితే రావచ్చు."

"వస్తాను, శార్, వచ్చేటందుకుదా వచ్చాను." అని దర్జాగా వచ్చి ఓకుర్చీలో ఆసీనుడై, "అయితే శార్, నిండా మంచికార్యం చేయించారే?" అన్నాడు.

"ఎవరికార్యం? నే చేయించడ మేమిటి. అర్థంకావడం లేదు. నే నెరుగున్నంతవరకు యీయింట్లో ఎవరి గర్భాధానకార్యం జరగలేదు. మీకు యిచ్చేందుకు ఫలప్రదానం ఏమీ లేదు."

"అంతా జోక్‌గా వుందాశార్. అదిదా చెప్తాను. మామగారిది నాలుగువందలు అట్టనే గబక్కన మాయమైందే. షుమ్మజోర్‌గా వుందా?"

"అయితే ఏంకావాలి యిప్పుడు?" అన్నాను, జరిగిందాన్ని, జరుగుతున్నదాన్ని, జరుగబోయేదాన్ని సమన్వయంచేసుకొని.

"మీరుదా కావాలి శార్. ఈచోరీ వున్నదే, శార్, యీ చోరీ, దానివిషయందా, మీకేమన్నా కొంచమైనా తెల్పునా, అందుకు. ఆఁ. ఆమ, అదిదా కావాలి శార్."

"ఊఁ. కావాలిస్తే?"

"ఎన్నయిదీ. నిండాట్రబుల్‌గా మాట్లాడుతారే శార్. అడిగేదిదానికి నేరుగా సమాధానందా చెప్పుమీ."

"అంటే, ఆదొంగతనానికి నాకూ ఏమన్నా సంబంధ మున్నదేమోననా ప్రశ్న?"

"ఆఁ. ఆమ. అదిదా ముఖ్యమూ."

"ఆవిషయం నాకేం తెలియదు."

"అదంతా ఇల్లెశార్. మీమామగారుదా నాకు చెప్పినారూ, మీరే తీసివుండేది అని."

"అయితే ఆయన్నే అడగండి ఆవిషయం."


"షుమ్మ. ప్రయోజనమిల్లె కబుర్లు యెందుకు శార్. నిజందా కుయ్యకూడదా? అట్లా దుడ్డుదా ఎత్తితే, నిండా ఆక్వర్డ్‌గా లేదా సామీ!"

"నోరుముయ్. సాంబారుకబుర్లు చెప్పక. అనవసరంగా బొల్లుమాట లంటే చెవు లెక్కేస్తాను."

ఇంతలో మామగారు "రండి, డ్రాయరు చూపిస్తాను." అని ఇన్‌స్పెక్టరును కేకవేశారు. అతను నన్ను గూడా రమ్మన్నాడు. పోనీ గదా అని వెళ్లాను. ఆఫీసుగదిలోకి పోయేసరికి అఖండమైన దృశ్యం గోచరించింది. వాకిట్లో ఎర్రతలపాగావాళ్లు విచ్చుబాకులతో డజను మంది. ఈ కలవరమంతా గమనించి మూగిన త్రోవపొయ్యేవాళ్లు రెండుడజన్లు. అవతలగదిలో కన్నీళ్లతో కుమిలిపోతూన్న రాధ, అత్తగార్లు.

మామగారు ఆవేశంతో దహించుకుపోతూ, "ఇదిగో నండీ, యిదీ డ్రాయరు. తాళంచేతులు యిక్కడ మరిచిపోయి నాను. ఇందులోనుంచి ఆగదిలోకి వున్న ద్వారం యిది. తెరిచే వున్నది. నిన్న సాయంకాలం అదృష్టవశాత్తు నౌకర్లందరు పెందరాడే వెళ్లిపోయినారు. కాబట్టి నే చెప్పేదేమంటే..."

ఇంతలో యిన్స్పెక్టరు నావంక



"మామగారు ఆవేశంతో దహించుకుపోతూ.........
ఇందులోనుంచి ఆగదిలోకి వున్న ద్వారం యిది."

చూచి, "ఏమంటారు?" అన్నాడు.

"ఏమిటి అనేది. అందులో పెట్టారుకాబోలు. మాయమైంది."

"మాయమైందా, శార్, తమరు తీస్తేదా మాయమౌతుంది." అని, మామగారివైపు తిరిగి, "తాళం గట్టిదిగాదా శార్!" అన్నాడు.

"అయ్యో, గట్టిదేనండి. నాలుగులివర్లది. కాని ఏం లాభం? చెవులు బల్లమీదే మరిచిపోయినాగా? ఇదిగో చెవి, దీనితో తీసి వుండాలి." అని చెవి అందులోపెట్టి డ్రాయరు లాగాను. లాగి లాగకముందే "ఆఁ" అని అంబోతురంకె ఒకటేసి, "ఉన్నది, ఉన్నది" అని వెర్రివాడల్లే గంతులేశాను. ఇన్స్పెక్టరు మామగారివద్దరకుపోయి, చేతులో కట్ట పరికించి "ఉన్నాయా, శార్, చాలగమ్మత్తుగుందే, శార్. మాడిపార్టుమెంటుపేరు చెప్పేసరికే అట్లుండాలి శార్" అని ఆత్మస్తుతి చేసుకొన్నాడు. మామగారు నోట్లు సరిగా లెక్కపెట్టుకొని, ఉదారహృదయంతో, ఇన్స్పెక్టరుకి, బృందానికి వందనసహస్రాలు అర్పించారు. వచ్చి చేసిన ఘనకార్యానికి సంతోషిస్తూ, అంతా తనమహిమేనని దృఢంగా నమ్ముతూ, నావైపు తిరిగి, "పోదునా, శార్. నిండా బుద్ధిశాలివని జేస్తిని. ఒకవేళ తీస్తినే అనుకో, తిరిగి అట్లా పెట్టివేయవలెదా. నిండా మంచివాడవు శార్" అన్నాడు ఇన్స్పెక్టరు "పోయముయ్. ఆట్టే వాగకు. ప్రాణంతో వెళ్తున్నందుకు సంతోషించు" అని గిరాలున నాగదిలోకి వచ్చి, నాసామాను సర్దుకోవడం మొదలుపెట్టాను.

ఇంతలో ఎక్కడనుండో రాధ వచ్చింది. తానుచేసిన ఆలోచన, ప్లాను నెగ్గినదిగదా అనే సంతోషం ముఖంలో తాండవిస్తోంది. కాని నాహడావిడి గమనించి కొంచెం తెల్లబోయి, "ఎందుకు సర్దుతున్నారు?"

"వెళ్లిపోతున్నాను, మాఊరు."

"వద్దు, వుండండి. వెళ్లద్దు, నాకోసం..."

"వుండను, రాధా. అడ్డుపెట్టకు. ఒక్కనిమిషంగూడా వుండడానికి నాకు ఆస్కారంలేదు. జరిగిన అవమానం చాలు. పెళ్లి అయిన రెండేళ్లకు మొదటిసారి వచ్చినందుకు మీనాన్నగారు దయ

చేసిన పండగమామూలు చాలు. చాలాసంతోషం. కాని వచ్చినందుకు విచారం ఏమాత్రం లేదు. చాలాసంగతులు క్రొత్తవి తెల్సుకున్నాను. ముఖ్యంగా, నీయొక్క ఆపేక్ష, అనురాగం ఎంత ఉత్తమమైనవో తెల్సుకొన్నాను. నిన్ను యిటువంటి గోల వుంచడం యిష్టం లేదు. వీలైనంతత్వరలో పిలిపించుకుంటాను, నాదగ్గరకు" అని సర్దడం పూర్తిచేసి, కన్నీళ్లు వరదలుకట్టిస్తూ దీనంగా నిలబడ్డ రాధదగ్గరకు వెళ్లి, "విచారపడద్దు మీనాన్న చేసిందానికి నువ్వేమి చేస్తావు? త్వరలో యిద్దరం సుఖంగా వుందాం. నే వెళ్తున్నానని విచారం వద్దు. వెళ్లడమే మంచిది" అని కన్నీళ్లు తడిపి, "మంచిపిల్లవు— బంట్రోతును బండీ తెమ్మని చెప్పు" అన్నాను చెప్పినదానినంతా క్షణంలో గ్రహించి, మారుమాట లేకుండా ఛప్పున వెళ్లింది రాధ.

మరి అయిదునిమిషాలకు అత్తగారు వచ్చింది, మామగారి చర్యకు క్షమాపణ చెప్దామని కాని సామాను సర్దివుండడం చూచి నిర్ఘాంతపోయి, "ఏమిటిది?" అన్నది.

"ఏమీ లేదు. ఊరికి వెళ్తున్నాను" అన్నాను

"అయ్యో, అయ్యో! అంతపనే నాయనా! నామీద ఒట్టు. ఈదినం పండగ. అట్లు వెళ్లకూడదు జరిగినదంతా మరచిపోవలసింది. మామగారి సంగతి తెలియని దేముంది నాకోసం ఉండండి నా మాట కాస్త వినవచ్చు మా కింక తలెత్తుకు తిరగడానికి ఆస్కారం వుండదు బ్రతిమాలుకుంటాను" అంటూండగా బంట్రోతు బండి వచ్చిందని కబురుచెప్పాడు "క్షమించాలి, వెడ్తాను వెళ్లడమే మంచిది రాధతో యిప్పుడే మాట్లాడి అన్నివిషయాలు చెప్పాను మీకు సావకాశంగా తెలియజేస్తుంది" అని, మాట్లాడానికి ఆవిడెకు యిక అవకాశ మివ్వకుండా బయల్దేరాను బంట్రోతు సామాను చేర వేశాడు బండిలోకి. శ్యాలకుడు యింట్లో లేడు మామగారు పోలీసుదళాన్ని సాగనంపడానికి కచ్చేరీదాకా వెళ్లాడు కృతజ్ఞతా సూచకంగా బిక్కమొహాలతో అత్తగారు, ఆమెచాటున రాధ వాకిలిదాకా వచ్చారు. అత్తగారికి తిరిగి నమస్కరించి, రాధవైపు చూచి, "వెడ్తాను సంతోషంగా వుండు" అన్నాను

"ఉత్తరాలు వ్రాయండి" అన్నది మెల్లగా

"అలాగే వ్రాస్తాను బాగా చదువుకో" అని బండి ఎక్కి కదిలాను

పూర్వం, బృందారణ్యసీమను, పరిసరాలను తన మృదుమధుర గానామృతంతో పునీతంచేసి, నదీనదమల్లీ, తారాగణమల్లీ రస ధారల తానమాడించి, తాండవింపజేసిన నవనీరదశ్యాముని, మదన మోహనుని, మురళీకృష్ణుని ఉత్సాహపరచి, ఉత్తేజితునిగా జేసిన ఆనందామృతమూర్తి రాధాదేవియే, అదృష్టవశాత్తు నారాధగా పున రుద్భవించినదా - ధవళచంద్రికాతుల్యమగు మందహాసంతో, ఉమః కాంతిసమన్వితమగు విశాలనేత్రరోచిస్సుతో, తంత్రీస్వనభూయిష్ఠ వాగ్విలాసంతో? .. అనే లావణ్యభావసముద్రఫేనమాలికాడోలి కలలో ఉయ్యాలలూగుతూ రైలుప్రయాణము పూర్తిజేశాను.

* * * *

ఇంటికి వచ్చానన్నమాటేగాని మనశ్శాంతి ఏమాత్రం లేదు. జరిగిన ఉదంతమంతా మొదటినుంచి చివరదాకా తల్చుకుంటే గొప్ప ఇతిహాసరూపం దాల్చింది. లోపల్నుంచి రోషానలం అగ్ని పర్వతంలాగ మండిపోవడం ఇల్లా వుండగా, మర్నాడు ఉదయం, ఏదన్నా గ్రంథకాలక్షేపంతోనైనా శమను పొందుదామని అర్మాలు దగ్గరకు పోయి, ఒక్కొక్కటే దొర్లించి అప్యాయంగా, పింగళి మాష్టరుగారి "సంక్రాంతి" పుచ్చుకొన్నాను. చదువుతూండగా కంటబడ్డది:

"అన్ని పండువులందు ముఖ్య మిదిగాన
నత్తవారింటి కేగు మోక్రొత్త పెండ్లి
కొమరుడా! యందు నీవు కెక్కుడు సుఖమ్ము
ముద్దుమఱదలు నీతోటి ముచ్చటాడు,
వదినె నీతోడ మాటికి వరుసలాడు,
. .. .. . .. .. .. .........
........ .... ........ ...
ఊరివారలు నిన్నతిగారవమున
మన్ననలు సల్పుదురు, నీదు మామకూడ
నడుగులకు భృత్యుడై మడుగులొత్తు(?)
నత్తవారింటి కేగిరావయ్య నీవు!

మన్మథునిచేత భగ్నపరుపబడ్డ తపోనిష్ఠాగరిష్ఠుడు శివుని కూడా అంత ఉద్వేగం పుట్టియుండదు తొక్కత్రొక్కబడిన తాచల్లే, హరనేత్రజ్వాలలను మించిన ఉష్ణంగల బుస్సలు కొడ్తూ స్వగతం ప్రారంభించాను

"ఏమిటి, ఏమి టీ అపభ్రంశం వ్రాతలు! చేతకాకపోతే ఊరొక్కవాలి మానవస్వభావసాగరాన్ని కూలంకషంగా మథించి వెలికితెచ్చిన అమృతభాండంలాగ ప్రదర్శించారు. హాలాహలమని గ్రహించాలి గ్రంథకర్తలు. వ్రాసిన యిర్వురికవులకీ వారివారి అత్త వారింట అనుభవాలు అంతే అయితే కావచ్చు కాని అందరికీ అంతే అవుతుంది—తప్పకుండా అత్తవారింటికి వెళ్లండి అని ఉద్బోధన ఎందుకు చెయ్యడం? అదే రాజకీయమైతే ౧౨౪ ఎ. సెక్షను పని జేసేది. కాని సారస్వతసామ్రాజ్యానికి నాథుడు లేకపోవడంచేత... వారి అనుభవమే అధికనుక అయితే "అయ్యా, మాఅదృష్టంవల్ల మాకు యిట్లా జరిగింది. మీయిష్టం. మీజాతకాల్లో ఎల్లా వుంటే అట్లా జరుగుతుంది. మమ్మల్ని నమ్ముకొనిమాత్రం వెళ్లద్దు." అని సవినయంగా విన్నవించుకోవలసింది. నా ఒక్కని విషయమే చెప్పడం లేదు. ఎంతమంది అల్లుళ్లకి—అత్తవారికి—సఖ్యత వుంది లోకంలో? అత్తవారింటి మర్యాదలతో, ఆదరణలతో, ప్రవర్తన

లతో తప్పుపట్టుకొని, విసుగుజెంది, విరక్తిపొందని అల్లుళ్లు ఎంతమందివున్నారు లోకంలో? తుదకు ఇల్లరికం వెళ్లిన అల్లుళ్లలో మాత్రం అత్తవారిని దుమ్మెత్తిపొయ్యనివాళ్లు ఎవరున్నారు? భోజనం సరిగా లేదనో, ఫలహారాలు సరిగా అమరలేదనో, బట్టలు నవరుతాళ లేదనో, చదువుకు డబ్బుయివ్వలేదనో, ఆస్తివ్రాసి కట్టబెట్టలేదనో, ప్రతిఅల్లుడికీ ఏదో ఒక కంప్లైయింటు వుంటుంది. ఉండకపోతే శిసలైన అల్లుడు కాదన్న మాట ముమ్మాటికీ కాదు!

ఇంత వివిధప్రకృతిగల సమస్యలు పదిపంక్తుల్లో క్లుప్తంగా, సన్నితంగా, తియ్యగా, లిఖిస్తే, ఏమిటి యీ జంటకవుల ధైర్యం. షేక్స్పియరులో వుండే గొప్పతనం ఏమిటి?— విశాలత్వం! ఎవరికి ఏసమస్యకు సమాధానం కావలసినా అతని రచనల్లో ఉన్నాయి అపారము! అట్టి ఉత్తమలక్షణాలు ఏమీ చూపెట్టకుండా, గీతాలు వ్రాస్తే—రామలింగారెడ్డిగారికి తికవుంటేమాత్రం—ఎట్లా సర్వజనాదరణం అవుతాయి అవకపోవడమే కాకుండా, అపచారంకూడాను. కాబట్టి యీకవులు రాబోయే ముద్రణములోనైనా తప్పకుండా మార్చివ్రాయాలి ఈలోపున కంటపడితే వారిపని ఉండనేవుంది! 'నీదుమామగూడ నదునులకు నీకు భృత్యుడై మనుసులొత్తునట!— విన్నారా? మామామగారుమాత్రం మామగాదా! పండుగ మామూలు!" అని ఏమిటో వెర్రిధోరణిలోపడి మహాబాధ పడ్తూండగా పోస్టువాడు వచ్చి ఉత్తరం యిచ్చాడు విప్పి చూచాను రాధ దగ్గరనుంచి. నేబయల్దేరిన మరిరెండుగంటలకే వ్రాసింది.

"నమస్కారములు—

నిన్న మీరు వెళ్లిన మరిగంటకు మానాన్నగారు యింటికివచ్చి మీరు వెళ్లారని తెలిసికూడా ఎటువంటిచింతా కనుపర్చలేదు డబ్బు దొరకిందిగదా అని ఒక్కటే సంతోషం తర్వాత, కోర్టువేళకి, స్నానంచేయడానికి లేచి, తువ్వాలు తీసుకోడానికిపోయి, పొరబాటున మ అన్నయ్య పెట్టె తెరిచారు. అందులో బట్టలమధ్య జేబురుమాలు పొట్లం ఒకటి కన్పించగా అనుమానంతో విప్పిచూచారు. నాలుగువందలరూపాయలకట్టా మడతపెట్టివున్నది. కెవ్వున కేకవేసి మా అమ్మదగ్గర కొచ్చి, "అబ్బాయిపెట్టెలో దొరికింది చూశావా!" అన్నారు. మాఅమ్మకు ఎక్కడలేని రోషం, కోపం వచ్చి, ఆయన్ని నానామాటలూ అన్నది తను మీమీద అన్యాయంగా చేసిన నిందారోపణకి, అన్నమాటలకు కించిత్తు పశ్చాత్తాపమన్నా కనుపర్చకుండా, మానాన్నగారు, "అబ్బాయి ఓవేళ తమాషాకు దాచాడేమో! వాడి కింతవరకూ చెడ్డబుద్ధులు లేవు" అంటూండగా, అన్నయ్య పరుగెత్తుకుంటూ వచ్చి, "అవునునాన్నా, తాళంచెవులు యథాలోపంగా పెట్టినందుకు తమాషాచేద్దామని, దాచాను" అని ఆయన్ను కౌగిలించుకొన్నాడు మాఅమ్మ మండిపడ్తూ, "వెధవా! కడుపున చెడబుట్టావు. తమాషాకు దాచావా? ఇంతకాండ జరుగుతూండగా దొంగను తేలుకుట్టినట్టు వూరుకొన్నావు ఇంటిదొంగను ఈశ్వరుడేనా పట్టలేడు ఎంతఅపద్రిష్ట! అల్లకల్లోలం! అల్లుడిమీద అనవసరంగా దొంగతనం కట్టారమ్మాఅని బ్రతికున్నన్నాళ్లు శాశ్వతంగా వుంటుంది దరిద్రంవెధవా" అని చేతిలో వున్న గరిటె విసిరివేసింది. విధివశాత్తు తప్పింది. ఇక అక్కడ వుంటే తినకు, పిల్లవాడికి మర్యాద దక్కదనికాబోలు మానాన్నగారు స్నానానికి వెళ్లి, అన్నయ్యనుకూడ అక్కడనుంచి పంపేశారు ఆయన వెళ్లినతర్వాత అమ్మతో రహస్యంగా నేచేసిన సాహసం చెప్పాను మొదలు కొంత గాబరాపడ్డదిగాని, సమయానికి తెలివిగా చేసినందుకు సంతోషించి "అవునే, అమ్మా, మంచిపని జేశావు ఆడబ్బు అప్పుడు డ్రాయరులో కన్పడకపోతే, ఆయన్ను పోలీసుకు వప్పచెప్పేవారే మీనాయన. మంచిపనిజేశావు! నాకు ఆలోచన తోచనేలేదు.. ఆడబ్బు తీసుకుని మీనాన్నగారిదగ్గర నుంచి, వడ్డాణం తిరిగి చేయిస్తానులే మీఆయనదగ్గర మిగిలిన అరవై రూపాయలతో బట్టలుగాని, ఆయనకు యిష్టమైనది మరేమన్నగాని కొనుక్కోమని వ్రాయి తప్పకుండ—" అని నన్ను బుజ్జగించింది. కాబట్టి మీరు జరిగినదంతా మరచిపోయి ఆసొమ్ము పెట్టి మీకు యిష్టమొచ్చింది పండుగప్రెజంటుగా కొనుక్కోండి ఏం నిశ్చయించుకుంది వ్రాస్తే సంతోషిస్తాను మీరు సుఖంగా ప్రయాణంజేసి యిల్లుజేరారుఅని తలుస్తాను మళ్లీ వారంలో కాశీకివెళ్లి ఆరునెలల దాకా రారుకాబోలు క్షేమసమాచారం అప్పుడప్పుడు తెలియజేయండి, దయయుంచి.

—రాధ."

ఉత్తరం ఒకటి–రెండు–మూడుమార్లు చదువుకొని డైరీ తెరిచి రాధఫోటోకి పక్కగా పెట్టాను డైరీ మనిషిహృదయం మోస్తరు. ఎన్నిరహస్యాలు, ఎన్నిరహఃసందేశాలు, ఎన్నిఫోటోలు, ఎన్నిపూరెమ్మలు–గుప్తంగా కాపాడుతుంది.

ఇక ఉంటాను.